సాక్షి
వికారాబాద్
శుక్రవారం । 22 । మార్చి । 2024



కల్యాణం.. కమనీయం

పట్టణంలో లక్ష్మీవేంకటేశ్వస్వామి ఆలయ 37వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. 8లో▸



నాణ్యతకు తిలోదకాలు

పెద్దేముల్ మండలంలో ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న సీసీ రోడ్లు మూణ్ణాళ్ల ముచ్చటగా మారుతున్నాయి. 8లో▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ :	సహర్ :
శుక్రవారం	శనివారం
సాయంత్రం	ఉదయం
6:33	4:56

న్యూస్‌రీల్

నాలుగు ఎకరాలు ఉన్నవారికి 'రైతుబంధు'

ఏఓ ఝూన్సీలక్ష్మి



పెద్దపల్లిలో వరి పంట వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న ఏఓ ఝూన్సీలక్ష్మి

ధారూరు: మండలంలో నాలుగు ఎకరాల భూమి ఉన్న వారందరికీ రైతుబంధు డబ్బు జమ చేసినట్లు ఏఓ ఝూన్సీలక్ష్మి తెలిపారు. గురువారం మండలంలోని పెద్దపల్లి గ్రామంలో పర్యటించి పంట వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మండలంలో 31,340 ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నాయని తెలిపారు. 15,096 మందికి రూ. 15.67 కోట్ల మేరకు రైతుబంధు డబ్బులు రావాల్సి ఉందని వివరించారు. ఇప్పటి వరకు నాలుగు ఎకరాలు ఉన్న 12,206 మంది రైతులకు రూ. 9,19,24,874 డబ్బు అందినట్లు తెలిపారు. ప్రధాన మంత్రి కిసాన్ యోజన కింద అర్హులైన 3,834 మంది రైతులకు రూ. 76.68 లక్షలు వారి వారి ఖాతాల్లో జమ చేశారని వివరించారు. ప్రస్తుత యాసంగిలో 4,650 ఎకరాల్లో రైతులు వరి పంట వేశారని తెలిపారు. రుద్రారం, గట్టెపల్లి, బూర్గుగడ్డ, నాగసమందర్, అల్లాపూర్ గ్రామాల రైతులు కోట్‌పల్లి ప్రాజెక్టు బేబీ కెనాల్, కుడి, ఎడమ కాలువల కింద వరి వేరుశెనగ పంటలు వేసినట్లు తెలిపారు. మండలంలో 1,580 ఎకరాల్లో మొక్కజొన్న, 690 ఎకరాల్లో జొన్న సాగు సాగు చేసినట్లు చెప్పారు. యాసంగి పంట వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు వివరించారు.

ఆర్‌ఎంపీ వైద్యుడిపై చర్యలు తీసుకోవాలి

అనంతగిరి: వాట్సాప్‌లో వైద్యం చేసి వ్యక్తి మరణానికి కారణమైన పరిగి ఆర్‌ఎంపీ వైద్యుడిపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మైపాల్, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా వైద్యాధికారి పల్వాన్‌కుమార్‌ను కలసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. పూర్తి స్థాయి విచారణ చేపట్టిన వైద్యుడిని కఠినంగా శిక్షించాలని కోరారు. మృతుడి కుటుంబానికి రూ.20లక్షల ఆర్థిక సహాయం అందజేయాలని కోరారు. ఇలాంటి ఘటనలు మరోసారి చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంలో బీజేపీదే అధికారం

చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి



కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

మర్పల్లి: త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గురువారం మండలంలోని కోట్‌మర్పలికి చెందిన నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహారెడ్డి, బీఆర్‌ఎస్ గ్రామ మహిళా నాయకురాలు అన్నపూర్ణ బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ మూడోసారి ప్రధాని అవుతారని అన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని పేర్కొన్నారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు మండల అభివృద్ధికి రూ. 40 లక్షలు వెచ్చించినట్లు తెలిపారు. కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గాలయ్య, ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్లు శ్రీధర్‌రెడ్డి, శివరాజ్, కేపీ రాజులు, జిల్లా ఉపాధ్యక్షులు రాజేందర్‌రెడ్డి, వివేకానందరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రామేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్ మాయ..!

రంగారెడ్డి జిల్లాలో ఐరన్‌ఓర్‌కు అనుమతులు

- తవ్వకాలు వికారాబాద్ సరిహద్దుల్లో..
- టన్నుకు రూ. 279 రాయల్టీ
- రోజుకు సగటున రూ.10 లక్షలు పక్క జిల్లా ఖాతాలోకి..
- నాణ్యమైన ఖనిజం ఉండటంతో ఎత్తుగడ
- జిల్లా ఆదాయానికి భారీగా గండి
- చోద్యం చూస్తున్న అధికారులు



మిర్జాపూర్ సమీపంలోని మైనింగ్ ఏరియా

వికారాబాద్: మైనింగ్ మాఫియా లీలలు రోజురోజుకూ పెరిగిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. అక్రమాల కారణంగా అటు ప్రభుత్వానికి, జిల్లా ఖజానాకు గండి పడుతోంది. ఒకచోట తవ్వకాలకు అనుమతులు పొంది మరో చోట రాయల్టీ చెల్లిస్తూ జిల్లాకు తీవ్ర అన్యాయం చేస్తున్నారు. వికారాబాద్ – రంగారెడ్డి జిల్లాల సరిహద్దులో భారీగా మైనింగ్ నిర్వహిస్తున్నారు. మన జిల్లా పరిధిలో తవ్వకాలు జరిపి రంగారెడ్డి జిల్లా ఖజానాకు రాయల్టీ జమ చేస్తున్నారు. దీంతో జిల్లాకు రావాల్సిన డీఎంఎఫ్టీ నిధులు పక్క జిల్లాకు వెళుతున్నాయి. వికారాబాద్ జిల్లా మిర్జాపూర్ శివారులో రెండు మూడు నెలలుగా తవ్వకాలు జరుపుతున్నా మైనింగ్ శాఖ అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో జిల్లాకు రోజుకు రూ. లక్షల్లో నష్టం వాటిల్లుతోంది. కలెక్టర్ స్పందించి జిల్లాకు జరుగుతున్న నష్టాన్ని నివారించటంతో పాటు సంబంధిత వ్యక్తులు, అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. జిల్లాలో ఏడాదికి ఎన్ని లక్షల టన్నుల ఖనిజం తరలించటానికి అనుమతి ఉంది..? ఇప్పటి వరకు ఎంత తరలించారు..? మన జిల్లాకు జరిగిన నష్టం ఎంత..? అనే విషయాలు తెలుసుకునేందుకు ఫుట్ మెజర్‌మెంట్ సర్వే చేపట్టాలని జిల్లా వాసులు డిమాండ్ చేస్తున్నారు.

అసలు ఏం జరిగిందంటే..

ఆంధ్రా ప్రాంతానికి చెందిన కొందరు వ్యక్తులు ఎస్ఆర్ మినరల్స్ పేరుతో వికారాబాద్ జిల్లా పరిధిలోని మిర్జాపూర్ శివారులో 26 ఎకరాలు, రంగారెడ్డి జిల్లా పరిధిలోని అస్తేపూర్ శివారులో 50 ఎకరాల, అంతారం శివారులో క్రెయాన్స్ మినరల్స్ కంపెనీ పేరుతో మరో 50 ఎకరాలు మైనింగ్ లీజు పొందారు. ఈ మూడు ప్రాంతాలు వేరైనప్పటికీ భౌగోళికంగా రెండు జిల్లాల సరిహద్దులో ఒకేచోట కలిసి ఉంటాయి. ఒక్కో మైన్స్‌లో వారికి ఏడాదికి 2.5 లక్షల టన్నుల ఖనిజం తరలించటానికి అనుమతి ఉంది. వికారాబాద్ జిల్లా మిర్జాపూర్ శివారులో అనుమతులు పొందిన మైనింగ్‌లో నాణ్యమైన ఖనిజం లభ్యమవుతోంది. ఈ ప్రాంత ఖనిజానికి మంచి డిమాండ్ ఉండటంతో రెండు నెలల క్రితమే మిర్జాపూర్ పరిధిలో 2.5 లక్షల టన్నుల ఖనిజాన్ని తరలించారు. నాణ్యత అంతగాలేని కారణంగా రంగారెడ్డి జిల్లా అస్తేపూర్, అంతారం శివారు ప్రాంతాల్లో ఉన్న మైనింగ్‌లో ఇంకా వీరు అనుమతి పొందిన ఈసీలు మిగిలి ఉన్నాయి. ఈ కారణంగా మైనింగ్ నిర్వాహకులు పొరుగు జిల్లా రాయల్టీపై మన జిల్లా ఖనిజాన్ని తరలిస్తున్నారు. దీంతో మనకు రావాల్సిన రాయల్టీ డబ్బు రంగారెడ్డి జిల్లా ఖాతాల్లో జమ అవుతున్నాయి.

జిల్లా ఖజానాకు తీవ్ర నష్టం

పక్క జిల్లా రాయల్టీ ఈసీలపై మన జిల్లాకు సంబంధించిన ఖనిజ సంపదను తరలిస్తుండటంతో జిల్లాకు రూ. కోట్లలో నష్టం జరుగుతోంది. రోజుకు సగటున రెండు నుంచి మూడు వేల టన్నుల ఐరన్ ఖనిజాన్ని తరలిస్తున్నారు. టన్నుకు రూ. 279.50 పైసలు ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలి. ఇందులో డీఎంఎఫ్టీ నిధుల కింద మన జిల్లాకు టన్నుకు రూ. 36 చొప్పున జమ చేస్తారు. రెండు నెలలుగా పొరుగు జిల్లా రాయల్టీపై మన జిల్లా ఖనిజాన్ని సుమారుగా 50 వేల నుంచి 60 వేల టన్నుల ఖనిజాన్ని తరలించి ఉంటారని అంచనా వేస్తున్నారు. ఈ లెక్కన మన జిల్లాకు రావాల్సిన రాయల్టీ డబ్బులు పొరుగు జిల్లా ఖాతాలో రూ.1.4 కోట్ల మేర జమ అవుతోంది. అలాగే జిల్లాకు రావాల్సిన డీఎంఎఫ్టీ నిధులు సుమారు రూ.20 లక్షల వరకు పక్క జిల్లాకు తరలిపోనున్నాయని అంచనా వేస్తున్నారు.

విచారణ జరిపిస్తాం



అక్రమ మైనింగ్ విషయం మా దృష్టికి రాలేదు. మైనింగ్, రెవెన్యూ శాఖల అధికారులను పంపి క్షేత్ర స్థాయిలో పరిశీలన చేస్తాం. తవ్వకాలపై సమగ్ర విచారణ జరిపిస్తాం. అక్రమాలు జరిగినట్లు తేలితే సంబంధిత వ్యక్తులు, నిర్వాహకులపై చర్యలు తీసుకుంటాం.

– నారాయణరెడ్డి, కలెక్టర్

జంపింగ్‌లకే జై

- పారాచూట్ లీడర్లకే కాంగ్రెస్ పెద్దపీట
- చేవెళ్ల బరిలో రంజిత్‌రెడ్డి
- మల్కాజిగిరి నుంచి పట్నం సునీతారెడ్డి



సునీతారెడ్డి



రంజిత్‌రెడ్డి

సాక్షి, రంగారెడ్డి జిల్లా: కాంగ్రెస్ అధిష్ఠానం పారాచూట్‌లకే పెద్దపీట వేసింది. చేవెళ్లకు సిట్టింగ్ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, మల్కాజిగిరి స్థానానికి వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి, సికింద్రాబాద్ లోక్‌సభ స్థానానికి ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పేర్లను ఖరారు చేసింది. ఈ మేరకు గురువారం రాత్రి అభ్యర్థులను ప్రకటించింది. ఈ ముగ్గురూ ఇటీవలే కారు దిగి.. హస్తం గూటికి చేరినవారు కావడం గమనార్హం. ఇతర పార్టీల నుంచి కొత్తగా కాంగ్రెస్‌లో చేరిన వారికి ఎంపీ సీట్లు కేటాయించడంతో మొదటి నుంచీ పార్టీనే నమ్ముకున్న లీడర్లకు ఆశాభంగం తప్పలేదు. అధిష్ఠానం తీరుతో పార్టీ శ్రేణుల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభంజనం వీచినా.. గ్రేటర్ పరిధిలో మాత్రం బీఆర్‌ఎస్ హవా కొనసాగించింది. మెజార్టీ స్థానాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులే విజయం సాధించారు. సాక్షాత్తూ సీఎం రేవంత్‌రెడ్డి ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్న మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం సహా ఇతర స్థానాల్లోనూ ఆశించిన సీట్లు గెలవలేకపోయింది.

కారు దిగి.. హస్తం గూటికి చేరి..

హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలో కనీస ప్రాతినిధ్యం లేకపోవడంతో అధికార కాంగ్రెస్ లోక్‌సభ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఏకంగా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టి సారించి మహానగర పరిధిలోని నాలుగింటిలో మూడు స్థానాలు కైవసం చేసుకునేందుకు వ్యూహరచన చేశారు. ఇందులో భాగంగా ఇతర పార్టీల నుంచి చేరికలకు తెరలేపారు. దీంతో చేవెళ్ల టికెట్ ఆశించిన ఎమ్మెల్సీ, మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, ఆయన సతీమణి వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఆ తర్వాత సిట్టింగ్ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి కూడా ఇదే స్థానాన్ని ఆశిస్తూ.. కారు దిగి హస్తం గూటికి చేరారు. మరోవైపు సికింద్రాబాద్ టికెట్ ఆశించి జీహెచ్‌ఎంసీ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, ఆయన సతీమణి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ శ్రీలతారెడ్డి దంపతులు కూడా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఆమె భర్త మోతే శోభన్‌రెడ్డి సికింద్రాబాద్, మల్కాజిగిరిలోని ఏదో ఒక స్థానం నుంచి పోటీ చేయాలని భావించి కాంగ్రెస్‌లో చేరినా.. ఆయనకు భంగపాటు తప్పలేదు.

ఆశలు.. అడియాసలై..

మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అసెంబ్లీ ఎన్నికలకు ముందే బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. అయన ఆ ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. మళ్లీ లోక్‌సభ బరిలో నిలిచి తన అదృష్టాన్ని పరీక్షించుకోవాలని భావించారు. మల్కాజిగిరి లోక్‌సభ స్థానం నుంచి టికెట్ ఆశించారు. నాగర్‌కర్నూలు మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం బీఆర్‌ఎస్ సీనియర్ లీడర్, సినీనటుడు అల్లు అర్జున్ మామ చంద్రారెడ్డి కూడా ఇటీవలే బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. వీరంతా మల్కాజిగిరి సీటును ఆశించారు. అనూహ్య పరిణామాల మధ్య అధిష్ఠానం వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డికి టికెట్ ఖరారు చేసింది. దీంతో ఇప్పటి వరకు ఇక్కడి నుంచి టికెట్ ఆశించిన మైనంపల్లికి ఆశాభంగమే మిగిలింది. నిన్నా మొన్నటి వరకు వేరే పార్టీలో పని చేసిన నేతలు.. ఎంపీ టికెట్లు ఆశించి తాజాగా అధికార కాంగ్రెస్‌లో చేరారు. లీడర్లు మారినంత మాత్రాన కేడర్ మారుతుందా? అనేది అనుమానమే.

పోరు రసవత్తరం..

చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థిగా మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నుంచి మాజీ జెడ్పీ చైర్మన్ కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, కాంగ్రెస్ అభ్యర్థిగా ఇటీవలే బీఆర్‌ఎస్‌ను వీడిన సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. ఈ ముగ్గురు నేతలు ఆర్థికంగా, సామాజికంగా బలమైన వారే. ప్రస్తుత ఎన్నికల్లో ఈ ముగ్గురు పోటీ పడుతుండటంతో ఇక్కడ పోటీ రసవత్తరంగా మారనుంది. మల్కాజిగిరి లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా మాజీ మంత్రి ఈటల రాజేందర్, బీఆర్‌ఎస్ నుంచి మాజీ ఎమ్మెల్యే రాగిడి లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ నుంచి పట్నం సునీతారెడ్డి బరిలో ఉన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎంపీగా ప్రాతినిధ్యం వహించిన ప్రాంతం కావడంతో ఆ పార్టీ ఈ సీటును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. బీఆర్‌ఎస్ అభ్యర్థి మినహా ఇక్కడ పోటీ చేస్తున్న కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు స్థానికేతరులు కావడం గమనార్హం.



ఇసుకకు బదులు డస్టు వినియోగం

అనుమానాస్పద లావాదేవీలపై నిఘా

- జూన్ 6 వరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి
- బ్యాంకర్లతో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక ప్రత్యేక సమావేశం
- ఆర్థిక లావాదేవీలపై ఆరా తీయాలని ఆదేశం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: భారత ఎన్నికల సంఘం లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ ఈ నెల 16న వెలువరించిన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి తక్షణమే అమలులోకి వచ్చిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక అన్నారు. జూన్ 6వ తేదీ వరకు ఇది అమలులో ఉంటుందని, అనుమానాస్పద లావాదేవీలను బ్యాంకర్లు గుర్తించాలని తెలిపారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో గురువారం జిల్లాస్థాయి బ్యాంకర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. లక్ష రూపాయలకు పైగా లావాదేవీలు జరిపితే కచ్చితంగా వివరాలు తెలియజేయాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో ఏటీఎంల్లో డబ్బులు నింపేందుకు వచ్చే సెక్యూరిటీ వ్యాన్ లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.

పేదోడి ఇళ్లు పూర్తయ్యేనా..?

- నాలుగేళ్లుగా నిర్మాణ దశలోనే డబుల్ బెడ్ రూంలు
- నాణ్యతా ప్రమాణాలు గాలికి
- ఇసుక స్థానంలో డస్ట్ వినియోగం
- పట్టించుకోని అధికార యంత్రాంగం

కొడంగల్: గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం కొడంగల్ పట్టణంలో నత్తనడకన సాగుతున్నాయి. పనులు ప్రారంభించి నాలుగేళ్లు కావస్తున్నా పురోగతి కనిపించడం లేదు. పట్టణ పరిధిలోని గాంధీనగర్ సమీపంలో డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం చేపట్టారు. పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. బిల్లులు రావడం లేదనే సాకుతో కాంట్రాక్టర్ ఇసుకకు బదులు డస్ట్‌ను వాడుతున్నారు. నాణ్యతకు తిలోదకాలు ఇచ్చి పనులను నాసిరకంగా చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇళ్లు నిర్మిస్తున్న ప్రాంతంలో శ్మశానవాటిక ఉండటంతో వాటిని తీసుకోవడానికి పేదలు ముందుకు రావడం లేదనే ప్రచారం జరుగుతోంది.

10 బ్లాకులు.. 168 ఇళ్లు

కొన్నేళ్లుగా ఊరిస్తూ వస్తున్న డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇప్పట్లో పూర్తయ్యేలా కనిపించడం లేదు. కాంట్రాక్ట్ దక్కించుకున్న వీకేసీ ప్రాజెక్టు వర్క్ కంపెనీ ఇళ్ల నిర్మాణంపై శ్రద్ధ చూపడం లేదనే విమర్శలు వస్తున్నాయి. మొదటి దశలో కొడంగల్‌కు 300 డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరయ్యాయి. గాంధీనగర్ సమీపంలో 10 బ్లాకుల్లో 168 ఇళ్లు నిర్మిస్తున్నారు. మిగిలిన 132 ఇళ్లను పట్టణ శివారులోని మిషన్ భగీరథ ప్లాంట్ వద్ద నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. ఇందుకోసం అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.16 కోట్లు మంజూరు చేసింది. గాంధీనగర్ వద్ద 168 ఇళ్ల నిర్మాణానికి రూ.9 కోట్లు, మిషన్ భగీరథ పథకం వద్ద నిర్మించే ఇళ్లకు రూ.7 కోట్లు కేటాయించారు. అయితే ఈ డబ్బు సరిపోవడం లేదని కంపెనీ ప్రతినిధులు పలు మార్లు పనులు ఆపారు. దీంతో అప్పటి ప్రభుత్వం అదనంగా నిధులు మంజూరు చేసినట్లు తెలుస్తోంది.

గృహలక్ష్మి పథకానికి 1,246 మంది దరఖాస్తు

గత ప్రభుత్వం ఎన్నికల సమయంలో గృహలక్ష్మి పథకాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే.. ఆ సమయంలో అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. కొడంగల్, పాత కొడంగల్, పాత కొడంగల్ తండా, గుండ్లకుంట, కొండారెడ్డిపల్లి, బూల్కాపూర్, ఐనన్‌పల్లి గ్రామాలకు చెందిన 1,246 మంది ఇళ్ల కోసం దరఖాస్తు చేశారు. అయితే అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోని రావడంతో ఈ పథకం మరుగున పడింది. ప్రజాపాలనలో భాగంగా పేదలు ఇళ్ల కోసం మళ్లీ దరఖాస్తు చేసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్లు, ఖాళీ స్థలాల కోసం వేలాది మంది అర్జీలు పెట్టుకున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం స్థలం ఉన్న వారు ఇల్లు నిర్మించుకోవడానికి ఆర్థిక సాయం చేయనున్నట్లు ప్రకటించింది. అయితే స్థలం లేనివారు, గతంలో దరఖాస్తు చేసుకున్నవారు తమకు కూడా ఇళ్లు మంజూరు చేయాలని కోరుతున్నారు. అలాగే అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను పూర్తి చేసి అర్హులైన పేదలకు ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

'ఉపాధి'లో మనమే టాప్

జిల్లాలో చురుగ్గా సాగుతున్న ఉపాధి హామీ పథకం పనులు

- ఈ ఏడాది 59.31లక్షల పనిదినాలు కల్పించడమే లక్ష్యం
- ఇప్పటి వరకు కల్పించిన పని దినాలు 56.48లక్షలు
- జిల్లాలో జాబ్‌కార్డులు 1.83లక్షలు
- కూలీల సంఖ్య 3.77లక్షలు
- వేతనాలు అందక కాంట్రాక్ట్ ఉద్యోగుల వెతలు



పరిగి మండలం సయ్యద్‌పల్లి సమీపంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

వికారాబాద్: జిల్లాలో ఉపాధి హామీ పథకం పనులు ఊపందుకున్నాయి. గత నెలతో పోలిస్తే ఈ నెలలో 30వేల మంది కూలీలు అదనంగా పనులకు హాజరవుతున్నారు. కలెక్టర్ నారాయణరెడ్డి, డీఆర్డీఓ నిరంతర పర్యవేక్షణ, సమీక్షలు కూలీలు సంఖ్య పెరగడానికి దోహదం చేస్తున్నాయి. రాష్ట్రంలో ఉపాధి పనులు చేపడుతున్న 32 జిల్లాల్లో వికారాబాద్ ముందు వరుసలో ఉంది. రోజు వారి పనులకు హాజరవుతున్న కూలీల సంఖ్య పరంగా చూస్తే మన జిల్లా మొదటి స్థానంలో ఉంది. కూలీల సగటున చూస్తే రెండో స్థానంలో ఉంది. వ్యవసాయ పనులు లేని కాలంలో వలసల నివారణకు కేంద్ర ప్రభుత్వం 2008లో దేశవ్యాప్తంగా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. అప్పటినుంచి అప్రతిహతంగా కొనసాగుతున్న ఈ పథకంలో ప్రతి సంవత్సరం వేలాది మంది ఉపాధి పొందుతున్నారు. ఒకప్పుడు కొన్ని పనులకే పరిమితమైన ఈ పథకం ప్రస్తుతం 50కి పైగా పనులు చేసుకోవడానికి వీలుంది. వ్యవసాయ అనుబంధ పనులు, పొలాల గట్ల వెంబడి మొక్కలు నాటడం, ఇంకుడు గుంతలు తవ్వుకోవడం, పాఠశాల క్రీడా మైదానాలను చదును చేయడం, ఫాంపాండ్స్ నిర్మాణాలు, పశువుల, గొర్రెల, మేకల పాకలు నిర్మించుకోవడం, మట్టి రోడ్లు వేసుకోవడం, పొలాల్లో నీటిని నిల్వకు రాతి, మట్టి కట్టలు నిర్మాణం, ఇలా ఎన్నో పనులు చేసుకోవడానికి అవకాశం కల్పిస్తున్నారు.

1,83లక్షల జాబ్‌కార్డులు

జిల్లాలో 1,83,309 జాబ్ కార్డులు ఉండగా 3,77,087 మంది కూలీలు పనులు చేస్తున్నారు. తాజా సమాచారం మేరకు ప్రస్తుత వేసవిలో 51 వేల మంది అదనంగా పనులకు వస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 59.31లక్షల పని దినాలను (మ్యాన్ డేస్) కల్పించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం 56.48 లక్షల పని దినాలు కల్పించారు. వీటికి సంబంధించి ఇప్పటి వరకు ఉపాధి కూలీలకు రూ.105 కోట్లు చెల్లించారు. 18 మండలాల్లో నిత్యం 51వేల మంది కూలీలు పనులకు వస్తున్నారు. గత నెలలో రోజూ 21 వేల మంది కూలీలు మాత్రమే వచ్చేవారు. ఈ నెలలో 30 వేల మంది వరకు పెరిగారు. అయితే కనీస వేతనాలకు అనుగుణంగా కూలి గిట్టుబాటు కావడం లేదని కూలీలు అంటున్నారు. ఎండ తీవ్రత పెరిగినందున ఉపాధి కూలీల కోసం గ్రామీణాభివృద్ధి శాఖ ఓఆర్‌ఎస్ పాకెట్లు, షెడ్ నెట్స్, ప్రాథమిక చికిత్స కిట్లను అందుబాటులో ఉంచుతోంది. కూలి డబ్బులు బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్ లేకపోవడంతో చెల్లింపులు ఆలస్యమయ్యాయి. ఈ సంవత్సరం బడ్జెట్ ముందుగానే విడుదల చేయడంతో వారం, పది రోజుల్లో చెల్లింపులు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

వేతనాలు అందక ఇబ్బందులు

డీఆర్డీఏ శాఖలో కాంట్రాక్టు ప్రాతిపదికన విధులు నిర్వహిస్తున్న 200 మంది ఉద్యోగులకు నెలనెలా వేతనాలు అందడం లేదు. అటెండర్లు, సీసీలు, ఏపీఓలు, టీఏలు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఏపీఎంలు తదితరులు వేతన వెతలు అనుభవిస్తున్నారు. తమకు వేతనాలు రాకున్నా నాలుగు నెలలుగా ఎండల్లో విధులు నిర్వహిస్తున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలనెలా ఇవ్వాల్సిన వేతనాలు మూడు నాలుగు నెలల వరకు ఇవ్వకపోవడంతో అప్పులు చేయాల్సి వస్తుందని తెలిపారు. పది నుంచి ఇరవై ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న తమను క్రమబద్ధీకరించాలని కాంట్రాక్టు ఉద్యోగాలు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నారు.

సకాలంలో కూలి డబ్బులు

జిల్లాలో 51వేల మంది ఉపాధి పనులు చేస్తున్నారు. వారికి షెడ్ నెట్స్, ఫస్ట్‌ఎయిడ్ బాక్సులు అందజేశాం. ప్రభుత్వం వసతుల కల్పనకు ప్రత్యేక నిధులంటూ ఇవ్వడం లేదు. గ్రామ పంచాయతీల గ్రీన్ బడ్జెట్ నుంచి వసతులు సమకూర్చుకోవాలని ప్రభుత్వం చెబుతోంది. దాన్ని మేము పర్యవేక్షిస్తాం. పనులు చేసిన కూలీలకు వారం రోజుల్లోనే డబ్బు చెల్లిస్తున్నాం.

– శ్రీనివాస్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి

త్వరితగతిన 'టిమ్స్' పూర్తి చేయండి

- ఆస్పత్రి భవన నిర్మాణ పనులపై కార్యదర్శి క్రిస్టినా చోంగ్తు ఆరా
- పనుల్లో వేగం పెంచాలని ఆదేశం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: కొత్తపేటలో నిర్మిస్తున్న టిమ్స్ హాస్పిటల్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టినా చోంగ్తు అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో గురువారం కొత్తపేటలో నిర్మిస్తున్న టిమ్స్ హాస్పిటల్, మహేశ్వరం మెడికల్ కాలేజీ పనులకు సంబంధించి వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సెక్రెటరీ క్రిస్టినా చోంగ్తు కలెక్టర్ శశాంకతో కలిసి సమావేశం నిర్వహించారు. మెడికల్ కాలేజీకి సంబంధించిన ప్రతిపాదనలు, అవసరమైన మౌలిక సదుపాయాల గురించి సంబంధిత అధికారులతో చర్చించారు. కచ్చితమైన ప్రణాళికలు రూపొందించి ప్రతిపాదనలు పంపాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న కొత్తపేట టిమ్స్ హాస్పిటల్ పనులను పరిశీలించారు. హాస్పిటల్ నిర్మాణ పనులను ఎల్‌అండ్‌టీ ఇంజనీర్స్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ జాయింట్ సెక్రటరీ సత్యనారాయణ, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అధికారి డాక్టర్ వాణి, గచ్చిబౌలి టిమ్స్ హాస్పిటల్ డైరెక్టర్ విమల థామస్, వనస్థలిపురం ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రియ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్ రావు, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గ్రామాభివృద్ధికి సహకరించాలి



ఇంటి పన్నును చెల్లిస్తున్న గ్రామస్తులు

కుల్కచర్ల: ప్రతి ఒక్కరూ పన్నులు చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలని కుల్కచర్ల పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని పలువురు ఇళ్ల యజమానులు ఇంటి పన్ను చెల్లించారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ.. కుల్కచర్ల గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న ఇంటి యజమానులు, దుకాణ సముదాయాల యజమానులు సకాలంలో పన్నులు చెల్లించి గ్రామాభివృద్ధిలో భాగం కావాలన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



శానిటేషన్ సిబ్బందితో మాట్లాడుతున్న మంజుల

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ పనులు సక్రమంగా నిర్వహించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్‌కుమార్ సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా గురువారం ఆమె శానిటేషన్ పనులను ఆకస్మికంగా పరిశీలించారు. పారిశుద్ధ్య నిర్వహణ ఎలా జరుగుతున్నాయని ఆరా తీశారు. కార్యక్రమంలో పలువురు శానిటేషన్ సిబ్బంది ఉన్నారు.

శ్రీకాంత్‌గౌడ్‌ను కలిసిన ఓబీసీ నాయకులు



శ్రీకాంత్‌గౌడ్‌ను కలిసిన లక్ష్మణ్ తదితరులు

అనంతగిరి: ఇటీవల రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులయిన నూతి శ్రీకాంత్‌గౌడ్‌ను వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు దుద్యాల లక్ష్మణ్ ముదిరాజ్ గురువారం హైదరాబాద్‌లో ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూలమాలలు శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట ఓబీసీ సెల్ జిల్లా కన్వీనర్ సత్యనారాయణ, సోషల్ మీడియా కన్వీనర్ దామోదర్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం అస్తవ్యస్తం



జినుగుర్తిలో రోడ్డుపై పారుతున్న మురుగు

తాండూరు రూరల్: మండలంలోని జినుగుర్తిలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. గ్రామంలోని చర్చికి వేళ్లేదారిలో ఓ ఇంటి ఎదుట మురుగు పారుతోంది. ఈ మురుగులో పందులు దొర్లుతున్నాయి. మురుగుకాల్వలు లేక మురుగురోడ్డుపై ప్రవహిస్తోంది. మురుగు నుంచి వచ్చే దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు చెబుతున్నారు. దోమలు కూడా స్వైర విహారం చేస్తున్నాయన్నారు. చిన్నారులు రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేకాధికారి పట్టించుకోని సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా వంతెనలు

- వంతెనలపై ఊడిన రేలింగ్
- మరమ్మతులు చేయడంలో అలసత్వం
- పట్టించుకోని అధికారులు



కోట్‌పల్లి వంతెనపై శిథిలావస్థకు చేరిన రేలింగ్



అన్నాసాగర్ బ్రిడ్జిపై కూలిన రేలింగ్

బంట్వారం: అధికారుల నిర్లక్ష్యం కారణంగా వంతెనలపై నిర్మించిన రేలింగ్ శిథిలావస్థకు చేరి కూలిపోయి ప్రమాదాల బారినపడే పరిస్థితి దాపురించిందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. రాత్రి వేళ వాహనదారులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని స్థానిక వాహనదారులు ఆరోపిస్తున్నారు. వివరాలలోకి వెళితే.. కోట్‌పల్లి మండల కేంద్రంలోని వాగుపై దాదాపు 40 ఏళ్ల కిందట బ్రిడ్జి నిర్మించారు. అదే సమయంలో అన్నాసాగర్ వాగుపై కూడా వంతెన కట్టారు. కాని రెండు బ్రిడ్జిలకు ఇరువైపులా అప్పట్లో వేసిన సైడ్ రేలింగ్ ప్రస్తుతం శిథిలావస్థకు చేరి ఎక్కడికక్కడ ఊడి పడుతోంది. సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులు కనీస మరమ్మతులు చేపట్టడం లేదని స్థానికులు మండిపడుతున్నారు.

అదుపు తప్పితే అంతే..

తాండూరు–సదాశివపేట రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. సిమెంట్, నాపరాయి, లోడింగ్ వాహనాలు వందల సంఖ్యలో నేషనల్ హైవేకు వెళ్లేందుకు ఇటు నుంచే వెళ్తుంటాయి. ఇతర వాహనాలు లెక్కకు మించి తిరుగుతాయి. కోట్‌పల్లి ప్రాజెక్టుకు టూరిస్టులు ఇదే దారిలో కార్లు, మోటారు బైకులపై అతివేగంగా ప్రయాణిస్తారు. వంతెనలపై వాహనాలు అదుపు తప్పితే ప్రమాదాలు జరిగే అవకాశముందని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోట్‌పల్లి , అన్నాసాగర్ బ్రిడ్జిలు 40 సంవత్సరాల కిందట నిర్మించడంతో శిథిలావస్థకు చేరి సైడ్ వాల్స్ పడిపోతున్నాయి. అన్నాసాగర్ వంతెనపై రేలింగ్ ఎక్కడికక్కడ ఊడిపడగా , కోట్‌పల్లి బ్రిడ్జిపై పూర్తిగా శిథిలావస్థకు చేరి కూలేందు సిద్ధంగా ఉంది. ద్విచక్ర వాహనదారులు ప్రయాణించాలంటేనే జంకుతున్నారు. వంతెనల వద్ద అదుపు తప్పితే వాగులో పడాల్సిందేనని భయాందోళన చెందుతున్నారు. సైడ్ వాల్స్ ఇంతలా అధ్వాన స్థితికి చేరినప్పటికీ రోడ్లు, భవనాల శాఖ అధికారులు మాత్రం కిమ్మనడం లేదు. ప్రమాదం జరిగేతే కాని పట్టించుకునేలా లేరని పలువురు వాపోతున్నారు.

కొత్తగా రేలింగ్ నిర్మిస్తాం

కోట్‌పల్లి ,అన్నాసాగర్ వంతెనలపై కొత్తగా రేలింగ్ నిర్మిస్తాం. వీటికి సంబంధించి రూ. 50 లక్షలకు ఎస్టిమేషన్ వేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే పనులు చేయిస్తాం.

–శ్రీనివాస్ డీఈ ఆర్‌అండ్‌బీ

వేలం పాటపై సందిగ్ధం!



మాల్ పశువుల సంతలో క్రయ, విక్రయాల కోసం వచ్చిన పశువులు (ఫైల్)

- గడువు ముగుస్తున్న మాల్ పశువుల సంత నిర్వహణ
- ఎన్నికల సంఘం అభిప్రాయం కోరిన గ్రామ పంచాయతీ

యాచారం: ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో యాచారం మండలంలోని మాల్ పశువుల సంత నిర్వహణ వేలం పాటపై సందిగ్ధం కొనసాగుతోంది. వేలం పాట నిర్వహించాలా.. వద్దా.. అనే అంశంపై స్పష్టత కోసం మాల్ గ్రామ పంచాయతీ రాష్ట్ర ఎన్నికల సంఘానికి లేఖ రాసింది. ఈ సంత నిర్వహణకు ఏటా మార్చి 30 లోపు వేలం పాట నిర్వహించాల్సి ఉంటుంది. వేలం పాటలో వచ్చిన ఆదాయంతో సంత నిర్వహణతో పాటు గ్రామ పంచాయతీ అభివృద్ధి పనులకు నిధులు వెచ్చిస్తారు. వేలం పాటలో ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు పాల్గొంటారు. వేలంపాట గడువు దగ్గర పడుతున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం నుంచి ఎలాంటి ఆదేశాలు వస్తాయని అధికారులు ఎదురు చూస్తున్నారు.

మూడు జిల్లాల్లో క్రేజ్

మాల్ గ్రామ పంచాయతీ పరిధిలో ప్రతి మంగళవారం జరిగే పశువుల సంతకు రంగారెడ్డి, నల్గొండ, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో ఎంతో క్రేజ్ ఉంది. మాల్‌లో జరిగే సంతకు మూడు జిల్లాల పరిధిలోని వందలాది గ్రామాల నుంచి రైతులు తమ పశువుల క్రయ, విక్రయాల కోసం వస్తారు. దీంతో వందలాది మంది మధ్యవర్తులు, చిరు వ్యాపారులు ఆదాయం పొందుతారు. ఈ మూడు జిల్లాలో పెళ్లిల్లు, శుభకార్యాలు ఏ గ్రామంలో జరిగిన మాంసం కోసం ఈ సంతకు వచ్చే గొర్రెలు, మేకలు కొనుగోలు చేసి తీసుకెళ్తారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



గాయపడిన జగ్యనాయక్

కుల్కచర్ల: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలయిన ఘటన కుల్కచర్ల మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దోమ మండలం మోత్కూరు గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామం హట్యనాయక్ తండాకు చెందిన జగ్యనాయక్ కుల్కచర్ల ప్రధాన చౌరస్తా నుంచి గ్రామంలోనికి వెళ్తున్న క్రమంలో పక్క నుంచి లారీ రావడం ఎడమవైపున ఆటో నిలిపి ఉండటంతో ప్రమాదవశాత్తు ఆటో తగలడం కుడివైపు నుంచి లారీ టైర్లు బైక్‌కు తాకడంతో బైక్‌పై ఉన్న జగ్యనాయక్ కాలు విరిగింది. 108 సహాయంతో బాధితుడిని పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు లారీ, బైక్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కార్డన్ సెర్చ్



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

తాండూరు డీఎస్పీ బాలక్రిష్టారెడ్డి



మాట్లాడుతున్న డీఎస్పీ, సిబ్బంది

యాలాల: సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం కార్డన్ కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు తాండూరు డీఎస్పీ బాలక్రిష్ణరెడ్డి పేర్కొన్నారు. గురువారం రాత్రి మండల పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఇందిరమ్మ కాలనీలో గొడవలు, ఘర్షణలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. చిన్న, చిన్న విషయాలకు గొడవలు పడి పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరగొద్దని స్థానిక ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా కాలనీలోని లారీలు, ఆటోలు, ద్విచక్ర వాహనాల పత్రాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో రూరల్ సీఐ అశోక్, యాలాల ఎస్‌ఐ శంకర్ తదితరులు ఉన్నారు.

శనేశ్వరునికి పూజలు



భూకైలాస్‌లో శనేశ్వరస్వామి విగ్రహం

తాండూరు రూరల్: మండల పరిధిలోని అంతారం తండాలో శనేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు వాసుపవార్‌నాయక్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శని త్రయోదని సందర్భంగా వ్యాస పూర్వక తైల అభిషేకం, పంచామృతం, సుగంధ ద్రవ్యలతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని వివరించారు. భక్తులు తరలివచ్చి స్వామివారికి పూజలు నిర్వహించాలని కోరారు.

కల్యాణం.. కమనీయం

ఘనంగా లక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణం



పరిగి: స్వామివారి కల్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే దంపతులు

పరిగి: పట్టణంలో లక్ష్మీవేంకటేశ్వస్వామి ఆలయ 37వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు మూడో రోజు గురువారం స్వామివారి కల్యాణమహోత్సవం కన్నుల పండువగా జరిగింది. వేదపారాయణం, అభిషేకం, హోమాలు నిర్వహించారు. కల్యాణంలో ఆయా మండలాల భక్తులు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం స్వామివారి పల్లకీ సేవ దేవాలయం నుంచి పరిగి పురవీధుల గుండా సాగింది. ఆలయ ముఖద్వారం సొంత డబ్బులతో నిర్మిస్తామని జెడ్పీటీసీ హరిప్రియ దంపతులు భక్తుల ఎదుట హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, టీటీడీ బోర్డు మెంబర్ సీతారంజిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ముకుందఅశోక్ కుమార్, జెడ్పీటీసీ హరిప్రియ, డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి హన్మంతుముదిరాజ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, సిద్ధాంతి పార్థసారథి ఆయా మండలాల ప్రజాప్రతినిధులు భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా స్వామివారి కల్యాణం

మోమిన్‌పేట: మండలంలోని వెల్‌చాల్ లక్ష్మీనర్సింహ్మస్వామి కల్యాణం గురువారం మధ్యాహ్నం ఘనంగా నిర్వహించారు. అంతకుముందు స్వామివారి ఉత్సవ విగ్రహాలను గుట్టపై నుంచి కింద ఉన్న కల్యాణ మండపానికి తీసుకు వచ్చారు. పండితుల వేద మంత్రోచ్చరణలు చదువుతుండగా భక్తుల జయ జయ ధ్వానాల మధ్య స్వామివారి కల్యాణం వైభవంగా జరిగింది. మహిళలు స్వామివారికి ఒడి బియ్యం పోశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.



స్వామివారి పల్లకీ సేవ ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే తదితరులు



మోమిన్‌పేటలోని వెల్‌చాల్ నర్సింహ్మస్వామి కల్యాణం

యువతి అదృశ్యం



మౌనిక (ఫైల్)

పరిగి: స్నేహితురాలి పెళ్లికి వెళ్లిన యువతి అదృశ్యమైన ఘటన మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మాల యాదయ్య కూతురు మౌనిక ఇంటర్ పూర్తి చేసి ఇంటి దగ్గరే ఉంది. ఈనెల 20న గ్రామంలో స్నేహితురాలి పెళ్లి ఉందని ఇంట్లో చెప్పి వెళ్లిన మౌనిక ఇంటికి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు స్నేహితులు, బంధువుల వద్ద ఎంత వెతికిన ఆచూకీ లభించలేదు. దీంతో తండ్రి యాదయ్య గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

జోరుగా కల్తీకల్లు విక్రయం

తాండూరు రూరల్: మండలంలోని జినుగుర్తిలో కల్తీకల్లు విక్రయం జోరుగా కొనసాగుతోంది. ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి కల్తీకల్లును నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

మత్స్యకారుల అభివృద్ధికి కృషి

రాష్ట్ర ఫిషర్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ సాయికుమార్

మొయినాబాద్‌రూరల్: ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధికి కట్టుబడి ఉందని రాష్ట్ర ఫిషర్ మెన్ కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ మెట్టు సాయి కుమార్ అన్నారు. గురువారం నగరంలోని ఆయన నివాసంలో మండలానికి చెందిన రంగారెడ్డి జిల్లా మత్స్యకార్మికుల విభాగం చైర్మన్ బాకారం మహేందర్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. సాయికుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని మత్స్యకారుల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ సహాయ సహకారాలు అందేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు.



సాయికుమార్‌ను సన్మానిస్తున్న మత్స్యకారులు

నాలాను ధ్వంసం చేసిన వ్యాపారులు

ఆగ్రహం వ్యక్తం చేసిన మాజీ ఎమ్మెల్యే బక్కని



కల్వర్టును ధ్వంసం చేసి గోడ కట్టిన ప్రాంతాన్ని చూపుతున్న మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు

షాద్‌నగర్‌రూరల్: ఎన్నో ఏళ్లుగా ఉన్న నాలాను ధ్వంసం చేసి తమకు అనుకూలంగా కల్వర్టును నిర్మించుకోవడం ఏమిటని మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం పట్టణ సమీపంలోని పాత జాతీయ రహదారిపై నూతనంగా ఏర్పాటు చేసిన నేషనల్‌మార్ట్ ఎదురుగా ఉన్న నాలాను మాజీ ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజావసరాల కోసం ప్రభుత్వం నిర్మించిన నాలాలను ధ్వంసం చేసే అధికారం ప్రైవేట్ వ్యాపారులకు ఎవరిచ్చారని ప్రశ్నించారు. పురాతన నాలాను కూల్చి తమకు అనుకూలంగా అడ్డంగా గోడ నిర్మించడం ఏమిటన్నారు. నాలాను కూల్చివేస్తే నీటి ప్రవాహం ఎక్కడికి పోతుందని నేషనల్ మార్ట్ సిబ్బందిని అడిగారు. ప్రైవేట్ వ్యాపారులు తమ ఇష్టానుసారంగా కూల్చివేస్తే ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్ అధికారులు ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. నాలాను ధ్వంసం చేసిన ఘటనపై సంబంధిత అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బఫర్ జోన్‌లో నిర్మాణాలు

పట్టించుకోని అధికారులు

తుక్కుగూడ: అక్రమార్కులు బఫర్‌జోన్‌లను సైతం వదలడం లేదు. మున్సిపాలిటీ పరిధిలోని మంఖాల్ గ్రామంలో సర్వే నంబర్ 376లో బఫర్ జోన్‌లో రియల్టర్లు యథేచ్ఛగా నిర్మాణాలు చేపట్టారు. మంఖాల్ వాగు నుంచి వరద నీరు బాగ్ మంఖాల్ చెరువు, తుక్కుగూడ గ్రామాల మీదుగా రావిర్యాల చెరువులోకి వెళ్తుంది. వాగులో నీరు నిర్మాణాలకు అడ్డు రాకూడదని రియల్టర్లు భారీ ఎత్తున గోడను నిర్మిస్తున్నారు. 100 ఫీట్ల వెడల్పుతో ఉన్న వాగు బఫర్ జోన్‌లో రిటైనింగ్ వాల్‌ను నిర్మించి నీటిని అడ్డుకోవాలని ప్రయత్నిస్తున్నారు. వాగులో అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపట్టి నిర్మాణాలకు సదరు రియల్టర్లు ఉపయోగిస్తున్నారు. వాగులో అక్రమ కట్టడాలు నిలిపివేయాలని స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బఫర్ జోన్ నిర్మిస్తున్న కట్టడాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై శంషాబాద్ డివిజన్ ఇరిగేషన్ ఏఈ గోవింద్ స్పందిస్తూ.. మంఖాల్ వాగులో నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్‌ను పరిశీలిస్తామన్నారు. అనుమతులు లేకుండా బఫర్ జోన్‌లో నిర్మిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



మంఖాల్ వాగు బఫర్ జోన్‌లో నిర్మిస్తున్న గోడ

కార్లతో విద్యార్థుల హంగామా

- ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం
- కౌన్సిలింగ్ ఇచ్చిన ఏసీపీ కేపీవీ రాజు



బీటెక్ విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఏసీపీ కేపీవీ రాజు, సీఐ సత్యనారాయణ

ఇబ్రహీంపట్నం: వారంతా బీటెక్ విద్యార్థులు.. తాము చేసేదే కరెక్ట్ అనుకునే స్వభావం కలిగిన వయసు వాళ్లది. కళాశాలలో జరిగే ఫేర్‌వెల్ పార్టీకి కార్లతో ర్యాలీగా వెళ్లారు. ఈ క్రమంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగించారు. గమనించిన పోలీసులు విద్యార్థులను అడ్డగించారు. వారిలో మార్పు తీసుకొచ్చేందుకు ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సంఘటన గురువారం చోటు చేసుకుంది. మంగళ్‌పల్లి, పోచారం గ్రామాల మధ్యనున్న ఓ ఇంజనీరింగ్ కళాశాలలో ఫేర్‌వెల్ పార్టీకి 20 కార్లతో ర్యాలీగా సుమారు వంద మంది విద్యార్థులు రోడ్లపైకి వచ్చారు. హైదరాబాద్, నాగార్జునసాగర్ ప్రధాన రహదారిలోని కొహెడ క్రాస్ రోడ్డు వద్ద ఇష్టానుసారంగా వాహనాలను నడుపుతూ, సామాన్య ప్రజలకు ఇబ్బంది కలిగించారు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చిన విద్యార్థులకు ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ మారయ్యలు ప్రత్యేకంగా కౌన్సిలింగ్ ఇచ్చారు. లైసెన్స్‌లు, అనుమతి లేకుండా ర్యాలీలు తీయడం, ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలిగించడం చట్టరీత్యా నేరమని విద్యార్థులకు వివరించారు. ఇలాంటి పొరపాట్లు మళ్లీ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.